సాక్షి
కృష్ణాజిల్లా
ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



సీఎంను కలిసిన ఎస్పీ

కోనేరుసెంటర్: సీఎం చంద్రబాబును కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధరరావు శనివారం పెనమలూరు మండలం పోరంకిలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు.



కనుల పండువగా గరుడసేవ

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసిన యోగానంద లక్ష్మీ నరసింహ స్వామికి శుక్రవారం రాత్రి గరుడ సేవ జరిగింది. లోకకల్యాణార్థం స్వామికి గరుడ సేవ నిర్వహించారు.



కృష్ణాజిల్లా జట్ల సత్తా

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లు సత్తాచాటాయి. మహిళల జట్టు ప్రథమ స్థానం, పురుషుల జట్టు తృతీయస్థానంలో నిలిచాయి. -8లో

న్యూస్‌రీల్

సూర్యప్రభపై శ్రీ వేంకటేశ్వరుడి ఊరేగింపు



గుడ్లవల్లేరు: మండలంలోని డోకిపర్రులో కొలువైన శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివార్లను శనివారం సూర్యప్రభ వాహనంపై కనులపండువగా ఊరేగించారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (మెయిల్) అధినేత, దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణ నడుమ ఈ వేడుక వైభవంగా జరిగింది. దేవదేవుడి దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా విచ్చేశారు. వేద పండితులు ధ్వజారోహణ ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు గరుడ ప్రసాదం పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం నిర్వాహకులు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు, పి.ప్రసన్న, పి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారుల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ అధికారుల అసోసియేషన్ ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యవర్గ ఎన్నికలు విజయవాడ గ్రీన్ హౌస్ ఫారెస్ట్ కార్యాలయంలో శనివారం జరిగాయి. అధ్యక్షుడిగా బి.లెనిన్ కుమార్, ఉపాధ్యక్షులుగా వి.రత్నకుమారి, ప్రధాన కార్యదర్శి పి.పోతురాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎం.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా ఎ.రామకృష్ణ, కోశాధికారిగా జి.దుర్గారావును ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు శశిభూషణ్ యాదవ్, రాజమండ్రి సర్కిల్ జోనల్ కార్యదర్శి చిన్న బిక్షం వ్యవహరించారు. నూతన సభ్యులను కార్యవర్గ సభ్యులు, అధికారులు అభినందించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో హర్షిత్‌సాయి ప్రతిభ



మచిలీపట్నం టౌన్: హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మచిలీపట్నానికి చెందిన కె.హర్షిత్ సాయి ప్రతిభ చాటాడు. సబ్ జూనియర్స్ విభాగంలో జరిగిన రెండు పోటీల్లో పాల్గొన్న హర్షిత్‌సాయి 315 కేజీల బరువు ఎత్తి ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నాడు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ చేతుల మీదుగా బంగారు, వెండి పతకాలు, ప్రశంసా పత్రాలను అందుకున్నాడు. జనవరి 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ ఛత్తీగఢ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు తాను హాజరవుతున్నానని హర్షిత్‌సాయి తెలిపారు. అతడిని నగరానికి చెందిన క్రీడాకారులు, ప్రముఖులు అభినందించారు.

దుర్గమ్మకు రూ.2 లక్షల విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు బెంగళూరుకు చెందిన భక్తులు శనివారం రూ.2 లక్షల విరాళం సమర్పించారు. బెంగళూరుకు చెందిన వెలుగురి కుమార్ దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఈఓ కె.ఎస్.రామరావును కలిసి విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితులు ఆశీర్వదించారు. అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ఎదురుచూపులు

- రైతులకు అందని సబ్సిడీ యంత్ర పరికరాలు
- పత్తాలేని ప్రభుత్వ రాయితీ పథకాలు
- రబీ వచ్చినా స్పందించని రాష్ట్ర ప్రభుత్వం



వరికోత మిషను

గుడ్లవల్లేరు: వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తుంటాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సబ్సిడీ వ్యవసాయ యంత్ర పరికరాలు రైతులకు అందని ద్రాక్షగానే మిగిలిపోయాయి. ఖరీఫ్ వెళ్లి రబీ వచ్చినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో రైతులకు ఎదురుచూపులే మిగిలాయి. యంత్ర పరికరాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వ్యవసాయ కార్యాలయాలకు రైతులు వెళ్తే ప్రస్తుతం ఆ అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. గతంలో జిల్లాలోని ఏడీఏలు, ఏఓల సహకారంతో ఆన్‌లైన్ ద్వారా పరికరాల కోసం దరఖాస్తు చేసుకునే సౌలభ్యం ఉండేది. వ్యవసాయ యాంత్రీకరణ కింద పరికరాలకు కోట్లాది రూపాయలతో వివిధ పథకాల కింద గతంలో వచ్చేవి. వ్యవసాయ శాఖ ట్రాక్టర్లకు అనుబంధమైన డిస్క్ ప్లగ్లర్, లెవలర్, క్లావ్‌లు, స్ప్రేయర్లు, రోటోవీటర్లు, పవర్ టిల్లర్లు, మినీ ట్రాక్టర్లు, కోతమిషన్లు వంటి పరికరాలు రైతులకు సబ్సిడీపై అందేవి. ఖరీఫ్‌లో ఇవ్వాల్సిన యంత్ర పరికరాలను కనీసం రబీలో అయినా అందజేసి ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను రైతులు కోరుతున్నారు.

దరఖాస్తు చేసుకునే వీలేది

జిల్లాలో 4,12,500 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. వరి, మొక్కజొన్న, వేరుశనగ, పెసర, మినుము వంటి సాధారణ పంటలు, చెరకు, అరటి, కంద వంటి వాణిజ్య, ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలను జిల్లా రైతులు దరఖాస్తు చేసుకుని ఖరీఫ్ సీజన్‌కే పొందాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ఎస్ఎఫ్ఎస్ఎం, ఆర్‌కేవీవై, ఫామ్ మెకనైజేషన్, స్కీమ్ తదితర పథకాల కింద సబ్సిడీ పరికరాల్ని రాష్ట్ర ప్రభుత్వం అందజేయాలి. హ్యాండ్ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, సీడ్ డ్రిల్స్, మల్టీ క్రాప్ ప్లాంటర్స్, నూర్పే యంత్రం, స్ప్రింకర్లు, పంపు సెట్ పరికరాలు, నీరు తోడే పైపులు, రోటోవీటర్లు, తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్‌తో నడిచే పరికరాలు, స్ప్రేయర్లు, ఇంజిన్లు, వరికోత యంత్రాలు, పవర్ టిల్లర్, కలుపు యంత్రం వంటి వివిధ పరికరాలపై సబ్సిడీపై దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.

చిన్న, సన్నకారు రైతులకే ఈ పథకం

చిన్న, సన్నకారు రైతులకే ఆ శాఖ ఎక్కువగా ప్రాధాన్యతను ఇస్తూ, చిన్న రైతులు ఐదుగురు చొప్పున గ్రూపులుగా ఏర్పడితే వారికి యంత్రాలు ఇవ్వాలి. ఈ గ్రూపుల వారు కస్టమర్ హైరింగ్ సెంటర్‌లో మొక్కజొన్న సంబంధ పరికరాల్ని అందజేయాలి. ఈ స్టేషన్ కింద పరికాలపై రాయితీలు పొందవచ్చు. రాష్ట్రీయ కృషీ వికాస్ యోజన(ఆర్‌కేవీవై) కింద కోట్లాది రూపాయలతో పాటు మిగులు నిధులు, కేంద్ర నిధులు జిల్లాకు కేటాయించాల్సి ఉంది. ఆ నిధులను జిల్లా రైతులకు కల్పించలేదు. ఈ గ్రూపులకు లక్షల రూపాయల వరకు సబ్సిడీ వర్తిస్తుంది.

జాతీయ ఆహార భద్రత ఎక్కడ?

జాతీయ ఆహార భద్రత మిషను పథకం కింద జిల్లాకు నిధులు కేటాయించాలి. గతంలో మిగులు నిధులు కోట్లాది రూపాయలు కూడా జిల్లాకే ఖర్చు చేశారు. ఆయిల్ ఇంజిన్లు, వాటర్ పైపులు వంటివి దీని కింద పొందొచ్చు. ఈ పథకాల కింద వ్యవసాయ పరికరాలను పొందేందుకు ఆసక్తి గల రైతులు మీ - సేవ కేంద్రాలకు దరఖాస్తు చేసుకునేందుకు వెళ్తే ఆ పథకాలకు నిధులు కేటాయించలేదని చెప్పటంతో రైతుల ఆశలు ఆవిరై ఇంటి ముఖం పడుతున్నారు. ఈ ఏడాది సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు నిధులు మంజూరు కాకపోవటంతో ఈ సారికి రైతులకు ఇవ్వలేమని జేడీఏ ఎస్.పద్మావతి వివరణ ఇచ్చారు.

నార్మల్ స్టేట్ ప్లాన్‌కు నిధులేవి?

జిల్లాలో రైతులకు వ్యవసాయ పనిముట్లను అందజేసేందుకు నార్మల్ స్టేట్ ప్లాన్ పథకం కింద కోట్లాది రూపాయల నిధులను జిల్లాకు ప్రభుత్వం కేటాయించాలి. ఈ పథకంలో ఓసీ, బీసీ వర్గాల రైతులకు 40 శాతం సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం సబ్సిడీ వర్తిస్తుంది. రొటోవీటర్లు, పవర్ టిల్లర్లు, కల్టివేటర్లు, ప్లగ్లర్లు వంటి పరికరాలు ఈ పథకంలో అందజేయాలి. కానీ ఆ పథకం పత్తా లేకుండా పోయింది. జిల్లాకు సబ్ మిషన్ ఆఫ్ అగ్రికల్చర్ యాంత్రీకరణ పథకం కేంద్ర ప్రభుత్వం జిల్లాకు నిధులను ఏటా కేటాయిస్తుంది. ఈ పథకంలో చిన్న ట్రాక్టర్లు (20హెచ్‌పీ), వరినాటే యంత్రాలు, కల్టివేటర్లు, రీపర్లు పొందవచ్చు. ఈ యంత్ర పరికరాలు కూడా ఈ సారి రైతులకు అందజేయలేదు.



రాయితీపై రైతులకు ఇచ్చే యంత్ర పరికరాలు

రైతులకు సబ్సిడీపై ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం సబ్సిడీ యంత్ర పరికరాలను ఈ రబీ సీజన్ ముగిసే లోగా అయినా రైతులకు అందజేయాలి. రైతులకు ఉచిత విద్యుత్ మీటర్లకు స్మార్ట్ మీటర్లను బిగించటం మానేసి, రైతుల సంక్షేమం కోసం కూడా చంద్రబాబు ఆలోచించాలి. యంత్ర పరికరాలకు ఎక్కువ శాతం రాయితీలను రాష్ట్రానికి కేంద్రమే ఇస్తుంది.

– నీలం మురళీ కృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ మాజీ కార్యదర్శి

రైతులకు రాయితీ బాబుకు నచ్చదు



రైతులకు రాయితీ ఇచ్చే విషయంలో సీఎం చంద్రబాబు రూటే సపరేటు. రైతులకు సబ్సిడీ ఇవ్వాలంటే ఆయనకు మనసు ఒప్పదు. అందుకే వ్యవసాయ యంత్ర పరికరాలను ఈ రెండు సీజన్లలో ఇచ్చేందుకు చర్యలు తీసుకోలేదు. కేంద్రం నిధులు ఇస్తుంటే, పరికరాలు ఇచ్చేందుకు ఎందుకు మోకాలడ్డుతున్నారు? – బి.వి.శ్రీనివాసరావు, సీపీఎం గుడ్లవల్లేరు మండల నాయకుడు

మరో గ్రంథాలయ ఉద్యమం తప్పదు

అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎందరో మహనీయుల ఉద్యమం, త్యాగాల ఫలితంగా సాధించుకున్న గ్రంథాలయ వ్యవస్థ పరిస్థితి రోజురోజుకు దిగజారుతోందని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీ నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మరో గ్రంథాలయ ఉద్యమం చేపట్టక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో రచయితలు, సాహిత్య, సాంస్కృతిక సంస్థలు, పుస్తక ప్రచురణకర్తలు కలిసి శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్దగల తెలుగు తల్లికి పూలదండ వేసి ప్రదర్శన నిర్వహించారు. కార్ల్ మార్క్స్ రోడ్, బీసెంట్ రోడ్ మీదుగా గాంధీనగర్‌లోని లెనిన్ విగ్రహం ఉన్న పార్క్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో పెనుగొండ లక్ష్మీ నారాయణ మాట్లాడారు. ముస్లిం, హిందు, క్రైస్తవుల కోసం మసీదులు, దేవాలయాలు, చర్చిలు ఉన్నట్లు విద్యార్థుల జ్ఞానం కోసం గ్రంథాలయాలు అవసరమని అన్నారు. గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక కన్వీనర్, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ.. 1914లో విజయవాడ నుంచే గ్రంథాలయ ఉద్యమం ప్రారంభమైందని, అదే స్ఫూర్తితో ఇక్కడ నుంచే పునర్వికాస ఉద్యమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు పిన్నమనేని మురళీకృష్ణ, అక్కినేని వనజ, గోళ్ల నారాయణరావు, చలపాక ప్రకాష్, సింగంపల్లి అశోక్ కుమార్, వెంకట నారాయణ, వరప్రసాద్, గుత్తికొండ లక్ష్మి, చందు నాగేశ్వరరావు, ఎం.లక్ష్మయ్య, టి.మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్షం.. పచ్చపాతం

- కూటమికి అనుకూలంగా సాగునీటి సంఘాల ఎన్నికలు
- సహకార సంఘాల ఎన్నికల ఒడంబడికలతో నీటి సంఘాల ఎన్నికలు
- బాపులపాడు మండలం రేమల్లె, మల్లవల్లిలో రెండు వర్గాలుగా పోటీ
- నందిగామ, పెందుర్రులో నామినేషన్ల చించివేత, ఎన్నికల అధికారిపై దాడి

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో శుక్రవారం సాగునీటి సంఘాల ప్రాదేశిక నియోజకవర్గాలు, సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 2,317 ప్రాదేశిక నియోజకవర్గాలు, 209 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా నిర్వహించింది. వైఎస్సార్ సీపీ ఎన్నికలను బహిష్కరించటంతో కూటమి నాయకులు ఇష్టానుసారంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. మండలానికి ఒక బాధ్యుడిని ఏర్పాటు చేసి అతని ద్వారా ఆయా ప్రాదేశిక నియోజకవర్గాలు, నీటి సంఘాలకు అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ముందుగానే నిర్ణయించి వారినే ఎన్నుకునేలా ఓటర్లకు సూచించారు. వీటితో పాటు సహకార సంఘాల ఎన్నికలు త్వరలో రానున్న నేపథ్యంలో ఆ ఒడంబడికలు, ఒప్పందాలతో ఈ ఎన్నికలు కూటమి నాయకులు నిర్వహించారు. కొన్ని చోట్ల వివాదాస్పద సంఘటనలు కూడా జరిగాయి.

నియోజకవర్గాల వారీగా..

- మచిలీపట్నం నియోజకవర్గంలోని బందరు మండలంలో 13 ప్రాదేశిక నియోజకవర్గాలకు ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. కూటమిలో జనసేన పార్టీకి పోతిరెడ్డిపాలెం, చిన్నాపురం ప్రాదేశిక నియోజకవర్గాలను ఒడంబడికలో భాగంగా అప్పజెప్పినట్లు సమాచారం.
- పెడన నియోజకవర్గంలోని పెడన మండలం నందిగామ ప్రాదేశిక నియోజకవర్గం 111, సబ్‌డివిజన్ 3లో ఎన్నికలు జరగ్గా ఓడిపోయిన అభ్యర్థి పామర్తి వెంకటేశ్వరరావు నామినేషన్ పత్రాలను లాక్కునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఎన్నికల అధికారి జి.మధు ఎడమచేతికి గాయాలయ్యాయి. వెంకటేశ్వరరావుకు ఎడమచేతికి గాయం కావటంతో సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో నందిగామ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన 12 ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలు నిలిపివేశారు. బంటుమిల్లి మండలం పెందుర్రు గ్రామంలో జరిగిన 128 ప్రాదేశిక నియోజకవర్గంలో జనసేన పార్టీకి చెందిన నాయకులు రెండు వర్గాలుగా చీలిపోయారు. నామినేషన్ పత్రాలను గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. గూడూరు, కృత్తివెన్ను మండలాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.
- గన్నవరం నియోజకవర్గంలో నీటి సంఘాల ఎన్నికలు ఏకపక్షంగా జరిగాయి. బాపులపాడు మండలంలోని మల్లవల్లి, రేమల్లె ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికల్లో టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి పోటీ చేయడానికి ప్రయత్నించారు. జనసేన పార్టీకి కొన్ని ప్రాంతాల్లో పట్టులేదని వారిని టీడీపీ నాయకులు విస్మరించారు.
- గుడివాడ నియోజకవర్గంలోని గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో నీటి సంఘాలు, ప్రాదేశిక నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నాయకులు ఏకపక్షంగా తమ పార్టీకి చెందిన అభ్యర్థులను ఎన్నుకున్నారు.
- అవనిగడ్డ నియోజకవర్గంలో జనసేన పార్టీకి చెందిన శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ చెప్పిన వ్యక్తులనే నీటి సంఘాలు, ప్రాదేశిక నియోజకవర్గాలకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చల్లపల్లి, నాగాయలంక మండలాల్లో టీడీపీ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వలేదని ఆ నాయకులు అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది.
- పెనమలూరు నియోజకవర్గంలో పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో మండలానికి ఒకర్ని పార్టీ తరుపున బాధ్యతగా అప్పగించి శాసనసభ్యులు సూచించిన పేర్లు ఉన్న వ్యక్తులనే అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నుకునేలా అధికారులతో కలిసి ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. రానున్న సహకార సంఘాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఒడంబడికలు, ఒప్పందాలతో ఈ ఎన్నికల్లో మిగిలిన వారిని పక్కకు తొలగించేలా టీడీపీ నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలించాయి.
- పామర్రు నియోజకవర్గంలోని అన్ని ప్రాదేశిక నియోజకవర్గాలు, నీటి సంఘాల్లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ వారికే పట్టం కట్టారు. పమిడిముక్కల, పామర్రు, తోట్లవల్లూరు, మొవ్వ, పెదపారుపూడి మండలాల్లో కూటమిలోని మిగిలిన పార్టీ నాయకులకు అవకాశం కల్పించకుండా టీడీపీకి చెందిన వారికే అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులు కట్టబెట్టారు. పామర్రు మండలంలోని ఒక్క కొమరవోలు ప్రాదేశిక నియోజకవర్గంలోనే జనసేన పార్టీకి చెందిన తాడిశెట్టి మధుకు ఉపాధ్యక్ష పదవి ఇచ్చి సరిపెట్టారు.



నందిగామ టీసీ ఎన్నికలు వాయిదా వేయడంపై అధికారులను నిలదీస్తున్న సర్పంచ్ బొడ్డు చినబాబు

లోక్ అదాలత్‌లో 10,762 కేసుల పరిష్కారం



ఇన్సూరెన్స్ చెక్కు అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక

కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక

చిలకలపూడి(మచిలీపట్నం): జాతీయ లోక్‌అదాలత్ ద్వారా కక్షిదారులకు సత్వరం న్యాయం అందించేందుకు తాము లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో శనివారం జాతీయ లోక్‌అదాలత్‌ను అన్ని కోర్టుల్లో నిర్వహించారు. ఈ కోర్టుల్లో శనివారం రాత్రికి 10,762 కేసులు పరిష్కరించి రూ.26.97 కోట్లు నష్టపరిహారంగా చెల్లించారు. వీటిలో సివిల్ కేసులు 341, క్రిమినల్ కేసులు 10,266, ప్రీలిటిగేషన్ కేసులు 155 పరిష్కరించారు. మోటారు వాహన ప్రమాద క్లయిమ్‌లకు సంబంధించిన కేసులో బాధితులకు రూ.10.10 లక్షల చెక్కును జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక అందజేశారు. జిల్లాలోని మచిలీపట్నంలోని బెంచ్‌లలో 1,210, ఉయ్యూరు 333, మొవ్వ 409, గుడివాడ 1,563, అవనిగడ్డ 195, గన్నవరం 245, బంటుమిల్లి 74, విజయవాడ 2,489, నందిగామ 344, తిరువూరు 739, జగ్గయ్యపేట 1861, మైలవరం 245, నూజివీడు 387, కైకలూరులో 668 కేసులను పరిష్కరించామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి.వి.రామకృష్ణయ్య పలువురు జడ్జిలు, న్యాయవాదులు పాల్గొన్నారు.


దుర్గమ్మకు జ్యోతుల శోభ

- అంగరంగ వైభవంగా జ్యోతుల ఉత్సవం
- భారీగా తరలివచ్చి పాల్గొన్న భవానీలు, భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దారులు అన్నీ దుర్గమ్మ సన్నిధికే చేరాయి.. జ్యోతి కాంతులు జగజ్జననికి నీరాజనాలు పట్టాయి. భక్తుల శరణుఘోషతో ఇంద్రకీలాద్రి పరిసరాలు పులకించాయి. కళాకారుల విన్యాసాలు అమ్మకు కళాజ్యోతులర్పించాయి. కనకదుర్గమ్మకు శనివారం నిర్వహించిన జ్యోతుల ఉత్సవం అంగరంగ వైభవంగా సాగింది. మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భవానీలు, భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జ్యోతులను సమర్పించారు. సత్యనారాయణపురంలోని శివరామకృష్ణ క్షేత్రం నుంచి ఇంద్రకీలాద్రి వరకు నిర్వహించిన జ్యోతుల ఉత్సవంలో నగరానికి చెందిన భవానీలతో పాటు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని పలు గ్రామాలకు చెందిన భవానీలు విశేషంగా తరలివచ్చి అమ్మవారికి జ్యోతులతో మొక్కులు చెల్లించుకున్నారు.



జ్యోతులతో భవానీలు, భక్తులు



రథంపై గంగ, పార్వతి సమేత మల్లేశ్వరస్వామి

ఉత్సవ మూర్తులకు పూజలు

శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రీ గంగ, పార్వతి సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు దుర్గగుడి ఈఓ కె.ఎస్.రామరావు, ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సప్తవర్ణ పుష్పాలతో దేదీప్యమానంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై ఉత్సవ మూర్తులు అధిష్టించగా, పూజాది కార్యక్రమాల నిర్వహించిన అనంతరం ఊరేగింపును ప్రారంభించారు. వందలాది మంది భవానీలు, భవానీ భక్తులు అమ్మవారి నామస్మరణ చేసుకుంటూ ఇంద్రకీలాద్రికి పయనమయ్యారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు జ్యోతులతో ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్య శివప్రసాద్‌శర్మ, ఆలయ గురు భవానీ నాగరాజు, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాస శాస్త్రి, ఈఈ వైకుంఠరావు, కోటేశ్వరరావు, దేవస్థానం ఇంజినీరింగ్, ఫెస్టివల్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జ్యోతుల ఉత్సవంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా మారాయి. కొమ్ము బూరలు, డప్పు నృత్యాలు, చిన్నారుల కోలాట నృత్యాలు, పలువురు కూచిపూడి, భరత నాట్య కళాకారులు తమ నృత్యాలను ప్రదర్శించారు. జ్యోతులతో పాటు ఆయా బృందాలు ముందుకు సాగగా, జ్యోతులు మార్గంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. ఊరేగింపులో దేవస్థాన ప్రచార రథం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

క్లుప్తంగా

రాయనకు నృత్య తపస్వి అవార్డు



విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన నాట్యాచార్యుడు రాయన శ్రీనివాసరావుకు నృత్య తపస్వి అవార్డు లభించింది. ఈ విషయాన్ని ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరుకు చెందిన అభినయ నృత్యభారతి సంస్థ ఏటా సంప్రదాయ నృత్యంలో విశేషమైన కృషి చేసిన వారికి నృత్య తపస్వి అవార్డులతో సత్కరిస్తుంది. 2024వ సంవత్సరానికి గానూ శ్రీనివాసరావు నృత్యరంగంలో చేసిన కృషికి ఈ అవార్డు ప్రదానం చేశారు. ఏలూరులో శుక్రవారం నిర్వహించిన 29 వ జాతీయ నృత్యోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సినీ నిర్మాత అంబికా కృష్ణ చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. అభినయ నృత్య అకాడమీ నిర్వాహకులు హిమసుందర్, ఆనం ప్రసాద్ పాల్గొన్నారు. శ్రీనివాసరావు విజయవాడలో శ్రీనటరాజా నృత్యాలయం స్థాపించి గత 12 ఏళ్లుగా వందలమందికి నృత్యంలో శిక్షణ ఇచ్చారు. రాష్ట్రంలోనూ, రాష్ట్రేతర ప్రాంతాలలో నాట్య కళ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

దాచేస్తే దాగని సత్యం

వైఎస్సార్ సీపీ పాలనలోనే గణనీయమైన అభివృద్ధి

- అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాల అభివృద్ధి ఎవరి పాలనలో ఎంత?
- గత టీడీపీ పాలనలో కేవలం రూ.76 లక్షలతో అభివృద్ధి పనులు
- వైఎస్సార్ సీపీ పాలనలో రూ.4.31 కోట్లతో అభివృద్ధి
- మాజీ ఎమ్మెల్యే సింహాద్రి చొరవతో అవనిగడ్డలో కిడ్నీ డయాలసిస్ కేంద్రం



అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాల

అవనిగడ్డ: అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అభివృద్ధి పనులు వైఎస్సార్ సీపీ పాలనలో అధికంగా జరిగితే.. గత టీడీపీ పాలనలో తక్కువగానే పనులు జరిగాయని చెప్పొచ్చు. అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో నెలకొన్న సమస్యలపై 'సాక్షి' ఇటీవల కథనం ప్రచురించింది. 'గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాలను పట్టించుకోలేదని, ఎలాంటి అభివృద్ధి జరగలేదని' కూటమి నాయకులు ఆరోపణలు చేశారు. వైఎస్సార్ సీపీ పాలనలో రూ.4.31 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చొరవతో కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, కళ్లకు గంతలు తొలగించి చూస్తే ఇవన్నీ కనిపిస్తాయని వైఎస్సార్ సీపీ నేతలు ఘాటుగా స్పందించారు. వీరిద్దరు చెబుతున్న వాటిలో ఏది నిజం. గత పదేళ్లలో ఎవరి పాలనలో ఎంత అభివృద్ధి జరిగిందో తెలుసుకుందాం.

రూ.4.31 కోట్లతో..

గతంలో టీడీపీ పాలనలో అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాల అభివృద్ధి కోసం ఖర్చు చేసింది కేవలం రూ.76 లక్షలు మాత్రమే. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో రూ.4.31 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. రూ.3.20 కోట్లతో నూతన సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మించగా, రూ.15 లక్షలతో జగనన్న ప్రాణవాయువు(ఆక్సిజన్ కేంద్రం), రూ. 71 లక్షలు సీఎస్ఆర్ నిధులతో సీమాక్ సెంటర్‌లో ఆధునిక స్కానింగ్ యంత్రం, ఆధునిక జన రేటర్లు ఏర్పాటు, రూ.10 లక్షల వ్యయంతో ఏరియా వైద్యశాల అభివృద్ధి, రూ.15 లక్షలతో కిడ్నీ డయాలసిస్ సెంటర్ ఏర్పాటుతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించారు.

టీడీపీ హయాంలో అరకొర వైద్యులు.. వైఎస్సార్ సీపీ హయాంలో వైద్యుల భర్తీ

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నలుగురు డాక్టర్లు మాత్రమే ఉండేవారు. మత్తు డాక్టర్ లేక ప్రతి కేసుని మచిలీపట్నంకు రిఫర్ చేసేవారు. వైఎస్సార్ సీపీ హయాంలో గైనకాలజిస్ట్, అనస్థీషియా, పిడియాట్రిక్, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ డాక్టర్లతో పాటు ఇద్దరు జనరల్ డాక్టర్లు అందుబాటులో ఉన్నారు. మందులు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేవి.

వైఎస్సార్ సీపీ పాలనలో రెట్టింపు డెలివరీలు

గత టీడీపీ ఐదేళ్ల పాలనలో అవనిగడ్డ ఏరియా వైద్యశాలలో మొత్తం 463 డెలివరీలు జరగ్గా, 23,487 మంది ఇన్ పేషెంట్స్, 2,91,589 మంది అవుట్ పేషెంట్స్‌కు వైద్యసేవలు అందించారు. సీఎం జగన్ పాలనలో 822 డెలివరీలు చేశారు. టీడీపీ పాలనలో కంటే వైఎస్సార్‌సీపీ పాలనలో 359 డెలివరీలు ఎక్కువ జరిగాయి. ఈ ఐదేళ్లలో 29,545 మంది ఇన్ పేషెంట్స్, 3,43,933 అవుట్ పేషెంట్స్‌కు సేవలు అందించారు. టీడీపీ పాలనలో పాముకాటు కేసులకు సక్రమంగా వైద్యసేవలు అందక పోవడం వల్ల 11 మంది మరణించగా, వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్క పాము కాటు మరణం కూడా లేకపోవడం గమనార్హం. ఇక్కడ కోవిడ్ సెంటర్ ద్వారా 296 మంది కోవిడ్ పేషెంట్లకు వైద్య సేవలు అందించారు. నాటి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు దాతల సహాయంతో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్ ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కోరిక మేరకు నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో కిడ్నీ డయాలసిస్ కేంద్రంను గత ఏడాది నవంబర్‌లో ఏర్పాటు చేశారు.



అవనిగడ్డ సీమాక్ కేంద్రంలో ఆధునిక స్కానింగ్ యంత్రం



అవనిగడ్డలో నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రం(ఫైల్)

అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో టీడీపీ, వైఎస్సార్ సీపీ హయాంలో అందించిన వైద్యసేవల వివరాలు

సంవత్సరం	ఓపీ(అవుట్ పేషెంట్స్)	ఐపీ(ఇన్ పేషెంట్స్)	డెలివరీ కేసులు
2014-15	53,202	5,073	97
2015-16	52,280	5,094	96
2016-17	53,216	5,033	94
2017-18	64,325	3,737	80
2018-19	68,566	4,550	96
2019-20	77,794	5,591	129
2020-21	88,044	5,510	166
2021-22	56,520	4,708	163
2022-23	59,678	5,950	174
2023-24	61,897	7,786	190
టీడీపీ పాలనలో జరిగినవి	2,91,589	23,487	463
వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో జరిగినవి	3,43,933	29,545	745


మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో కేకేఆర్ గౌతమ్ విద్యార్థుల ప్రతిభ



విజయం సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్

గుడివాడటౌన్: హోమిబాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ గత నెల 3వ తేదీన విజయవాడలో నిర్వహించిన రీజనల్ మ్యాథమెటికల్ ఒలింపియాడ్ (ఆర్ఎంఓ) 2వ లెవల్ పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు 9 మంది విజయం సాధించి 3వ స్థాయి పోటీలకు అర్హత సాధించారని కేకేఆర్ గౌతమ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ఫ్యాక్ ప్రిన్సిపాల్ ఎం.రామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థులు సీహెచ్. ఉజ్వల్‌రామ్, పి.నవదీప్, వీవీ కౌశిక్‌రెడ్డి, పి.బిందుభార్గవ్, కె.నిహాల్ రెడ్డి, బి.కీర్తన్ రెడ్డి, డి.రిషితారెడ్డి, కె.ప్రేమ్‌చంద్, బి.గురుదీప్ రెడ్డి విజయం సాధించి జనవరి 19న జరగనున్న ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ (ఐఎస్ఎంఓ) పోటీ పరీక్షలకు అర్హత సాధించారన్నారు. ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను ప్రిన్సిపాల్స్ ఎం.సత్యారామ్, పి.లక్ష్మీ ప్రసాద్, కె.జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు అభినందించారు.

చెట్టు పైనుంచి జారిపడి యువకుడి దుర్మరణం



పెడన: మామిడి చెట్టు పైనుంచి జారిపడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పెడన మండలం చేవెంద్ర గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై పెడన పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తన స్నేహితుడి వివాహానికి మామిడి ఆకులు అవసరమై చేవెంద్ర గ్రామానికి చెందిన గాజుల లక్ష్మీనాగరాజు(33) శుక్రవారం సాయంత్రం కాలువ గట్టుపై ఉన్న మామిడి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తూ చెట్టుపై నుంచి కాలు జారి కిందపడిపోయాడు. కింద ఉన్న వారు హుటాహుటిన మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని సోదరుడు వీర హనుమాన్‌బాబు ఫిర్యాదు మేరకు పెడన ఏఎస్ఐ టి.సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర కబడ్డీ పోటీల్లో కృష్ణాజిల్లా జట్ల సత్తా



విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి 71వ సీనియర్ స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లు సత్తా చాటాయి. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు ఎస్ఎస్‌కేసీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో కృష్ణా జిల్లా మహిళల జట్టు అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించి విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. జిల్లా పురుషుల జట్టు మూడో స్థానంలో నిలిచి ట్రోఫీని అందుకుంది. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటిన జట్లను ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, కృష్ణాజిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు నాంచారయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి పి.రవి అభినందించారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చిట్టిబాబుకు స్థానం



వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ పంపించిన సర్టిఫికెట్లు, మెడల్‌తో చిట్టిబాబు

గన్నవరం: కృష్ణాజిల్లా గన్నవరం గ్రామానికి చెందిన సంగెశెట్టి చిట్టిబాబు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్‌లో స్థానం సాధించారు. స్థానిక రాయ్‌నగర్‌కు చెందిన చిట్టిబాబు ఎంబీఏ వరకు చదివి ప్రస్తుతం విజయవాడలోని మాస్టర్ మైండ్ కళాశాలలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కంప్యూటర్ కీబోర్డ్‌పై వేగంగా టైపింగ్ చేయడంలో చిట్టిబాబుకు మంచి నైపుణ్యం ఉంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి ఆంగ్ల అక్షరాలు ఏ నుంచి జడ్ వరకు వేగంగా టైప్ చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు కావడం తనకు ప్రేరణ కలిగించింది. అయితే చిట్టిబాబు వినూత్నంగా ఆంగ్ల అక్షరాలను ఆల్ఫాబెట్ ఆర్డర్‌లో రివర్స్‌లో వేగంగా టైప్ చేయడంపై సాధన చేశారు. ఈ అక్షర క్రమాన్ని కేవలం రెండు సెకన్ల 65 మిల్లీ సెకన్ల వ్యవధిలో పూర్తిచేసి సదరు వీడియోను యూకేకు చెందిన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ సంస్థకు పంపించారు. చిట్టిబాబు ప్రతిభను గుర్తించిన సదరు సంస్థ ఈ ఏడాది నవంబర్ 17న చిట్టిబాబుకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కల్పిస్తూ సర్టిఫికెట్‌ను, మెడల్‌ను పంపించింది.

వాలీబాల్ ఇన్విటేషన్ టోర్నీలో ఎస్ఆర్ఎం ముందంజ



వాలీబాల్ పోటీలో తలపడుతున్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర- గుజరాత్ స్పోర్ట్స్ హాస్టల్ జట్లు

విజయవాడస్పోర్ట్స్: నాదెళ్ల బసవపూర్ణయ్య (ఎంబీపీ) ట్రస్ట్ అఖిల భారత వాలీబాల్ మహిళల ఇన్విటేషన్ టోర్నీలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ జట్టు దూకుడు ప్రదర్శిస్తోంది. వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఈ లీగ్ పోటీల్లో ప్రత్యర్థి జట్లపై వరుసగా గెలుస్తూ అత్యధికంగా ఎనిమిది పాయింట్లతో ముందంజలో కొనసాగుతోంది. ఆరు పాయింట్లతో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఆరు పాయింట్లతో జేఈపీఏఐఆర్ యూనివర్సిటీ జట్టు రెండో స్థానంలో ఉన్నాయి. తమిళనాడు క్రీడా ప్రాధికార సంస్థ(ఎస్ఏటీ) నాలుగు పాయింట్లు, పీకేఆర్ యూనివర్సిటీ జట్టు మూడు పాయింట్లు సాధించగా, గుజరాత్ స్పోర్ట్స్ హాస్టల్ జట్టు సున్నా పాయింట్లతో వెనుకంజలో ఉంది. శనివారం సాయంత్రానికి 12 మ్యాచ్‌లు జరిగాయి. ఆదివారం సాయంత్రం ఈ పోటీలు ముగుస్తాయని ఎంబీపీ ట్రస్ట్ చైర్మన్ నాదెళ్ల బ్రహ్మాజీ, కృష్ణాజిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి దోనేపూడి దయాకరరావు తెలిపారు. ఈ పోటీలకు చీఫ్ రిఫరీగా ఎం.డానియేల్ వ్యవహరిస్తున్నారు. ఉయ్యూరు మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, వీఆర్ సిద్ధార్థ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ బి.పాండురంగారావు ప్రత్యేక అతిథులుగా హాజరై రసవత్తరంగా జరుగుతున్న మ్యాచ్‌లను తిలకించారు. సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు డి.ప్రభాకరరాజు, సింగారావు, తులసీరెడ్డి, రామకృష్ణరాజులను నిర్వాహకులు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.

బోగస్ సొసైటీలను నమ్మి మోసపోవద్దు

తెలుగు ఫిలిం చాంబర్, తెలుగు ఫిలిం డిజిటల్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్



మాట్లాడుతున్న తెలుగు ఫిలిం చాంబర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భరత్ భూషణ్, దామోదర ప్రసాద్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో రకరకాల కార్మిక సంఘాలు, సొసైటీలు స్థాపించి సినీ కార్మికులను మోసం చేస్తున్నారని, అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్, తెలుగు ఫిలిం - డిజిటల్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ హెచ్చరించింది. విజయవాడ గాంధీనగర్‌లోని ఫిలిం చాంబర్ హాలులో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భరత్ భూషణ్, దామోదర ప్రసాద్ మాట్లాడుతూ కొందరు స్వార్థపరులు సొసైటీలు, కార్మిక సంఘాలు స్థాపించి సినీ కార్మికులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, గుర్తింపు కార్డులు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేస్తున్నట్లు చాంబర్ దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వారిని నమ్మి మోసపోవద్దని సినీ కార్మికులను హెచ్చరించారు. ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన తెలుగు ఫిలిం చాంబర్, దానికి అనుబంధంగా తెలుగు ఫిలిం- డిజిటల్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్, 24 అనుబంధ సంఘాలు విజయవాడ కేంద్రంగా పనిచేస్తున్నాయన్నారు. ఇకపై ఎవరూ డబ్బులు ఇచ్చి మోసపోవద్దన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించి కార్మికులకు త్వరలో 'స్కిల్ డెవలప్‌మెంట్, వర్క్‌షాపులు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో ఆయా సంఘాల బాధ్యులు జె.సాంబశివరావు, అలంకార్ ప్రసాద్, అమ్మిరాజు, వి.సురేష్, వెల్లంకి శ్రీనివాస్ కుమార్, డి.సత్యనారాయణ, మురళీకృష్ణ పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే శబరిమలకు పలు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు విజయవాడ డివిజన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మండురూపకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ నుంచి కొల్లం వెళ్లే(ట్రైన్ నంబర్07175)రైలు ఈనెల 19, 26 తేదీలలో సికింద్రాబాద్‌లో గురువారం రాత్రి 8 గంటలకు బయలుదేరి శనివారం తెల్లవారుజామున 1.30 కు కొల్లం చేరుతుంది. కాకినాడ పోర్టు నుంచి కొల్లం వెళ్లే(ట్రైన్ నంబర్07173) ఈనెల 18,25 తేదీలలో బుధవారం రాత్రి 11.50కి కాకినాడ పోర్టులో బయలుదేరి శుక్రవారం ఉదయం 5.30కు కొల్లం చేరుతుంది. విజయవాడ నుంచి కొల్లం వెళ్లే(ట్రైన్ నంబర్07177) 21, 28 తేదీలలో విజయవాడలో శనివారం రాత్రి 10.15కు బయలుదేరి సోమవారం ఉదయం 6.20కి కొల్లం చేరుతుంది.